క్లుప్తంగా

జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం



గుంటూరు ఎడ్యుకేషన్: జీఎస్టీ 2.0తో ఆర్థిక వ్యవస్థ మరింతగా బలవపేతమవుతుందని ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.శ్రీకాంత్ పేర్కొన్నారు అమరావతి రోడ్‌లోని హిందూ మేనేజ్మెంట్ కళాశాలలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ నినాదంతో జీఎస్టీ 2.0 పొదుపు సంబరాలలో భాగంగా వివిధ అంశాలపై మూడు రోజులు పాటు నిర్వహించిన కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు పన్ను చెల్లించి బాధ్యతాయుతంగా పొదుపు చేయడం ద్వారా మన దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వీ రమణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్బీఐ ముత్యాల రెడ్డి నగర్ బ్రాంచ్ మేనేజర్ మణికంఠేశ్వర్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కే లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చల్లా వైష్ణవి, వెంకట కళ్యాణ్, ఉమాదేవి, వేదవతి పాల్గొన్నారు.

రేపు మానసిక వ్యాధుల ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: మానసిక వ్యాధులపై ఈనెల 12వ తేదీ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినెల రెండో ఆదివారం 'స్పెషలిస్టులతో ఉచితవైద్య శిబిరాల్లో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్.హెచ్.ఓ భవనంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కె.ఎల్. తేజస్విని దీర్ఘకాల వ్యాధులు లైన డయాబెటిస్, అధిక రక్తపోటు బాధితులలో మానసిక సమస్యలుతదితర అంశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై శ్రీ మద్భగవద్గీత అష్టాదశ అధ్యాయంలోని మోక్షసన్యాసయోగంపై నిర్వహిస్తోన్న ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. తొలుత ఆలయ పాలకమండలి కమిటీ సభ్యులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. మూడు విభాలుగా సుఖాలను చిన్మయమిషన్ బ్రహ్మచారి సుధీరానందస్వామి వివరించారు.

వట్టివేరు సాగు ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని సీఎస్సార్ ఆర్గానిక్స్‌లో శుక్రవారం వట్టివేరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎటువంటి ఎరువులు, రసాయనాలు లేకుండా సేంద్రీయ పద్ధతిలో వట్టివేరు మొక్కల సాగు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ధనుంజయరావు, కార్యక్రమ నిర్వాహకుడు చిలుకాని సీతారామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నారా జోషి, కృష్ణ చైతన్య, ధనుంజయ్, పులి సత్యనారాయణ, శివకుమార్, శివశంకరరావు, వాణికుమారి, కోటేశ్వరమ్మ, జు రెహనా బేగం, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 15 మందిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నల్లపాడు పోలీసులు, ఈగల్ టీమ్ తెలిపిన వివరాలు.. గోరంట్లలోని శ్రీకన్వెన్షన్ వెనుక ఓ నివాసంలో పేకాట నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట రాయుళ్లని అరెస్ట్ చేసి, వీరి నుంచి రూ.96 వేలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు చెప్పారు.

ఎస్సీ హాస్టల్స్ తనిఖీ

పొన్నూరు: నాణ్యత కలిగిన భోజనంతో పాటు విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యు.చెన్నయ్య, హాస్టల్ వార్డెన్‌లకు సూచించారు. శుక్రవారం పట్టణం, మునిపల్లెలోని సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. మెనూ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. భోజన వసతులపై ఆరా తీశారు. వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ అనారోగ్యానికి గురైతే ఇంటికి వెళ్లాల్సిన అవసరం లేదని మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. పొన్నూరు ఎస్సీ బాలికల హాస్టల్లో ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేయించనున్నట్లు చెప్పారు. దుప్పట్లు, దోమతెరలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు వెంకటేశ్వరమ్మ,, సుష్మ ప్రియ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న నూరిఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పరామర్శించారు. పెదనందిపాడు మండలం అనపర్రులోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో శుక్రవారం జీజీహెచ్‌లో చేర్పించారు. వెంటనే నాయకులు చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ అధికారులకు సూచించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి పేద విద్యార్థులంటే లెక్క లేదని పేర్కొన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, దండుకోవడం తప్ప, విద్యార్థుల హాస్టల్స్‌లో శానిటేషన్, ఫుడ్‌పై ఏ మాత్రం దృష్టి సారించడం లేదని ఆరోపించారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని తెలిపారు. హాస్టల్‌లో ఉన్న 95 మందినే చూసుకోలేని ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలను ఏ విధంగా చూసుకుంటుందో అర్థం చేసుకోవచ్చాన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

రాత్రి నుంచి ఇబ్బంది పడుతున్నా....

బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బీసీ హాస్టల్‌లో 90 మంది విద్యార్థులు రాత్రి ఆహారం తీసుకున్నారని, వీరిలో 45 మంది అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. జ్వరం, వాంతులు, కడుపునొప్పి, మోషన్స్ గురువారం రాత్రి నుంచి ఇబ్బంది పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. హాస్టల్ వార్డెన్ కూడా సెలవులో ఉన్నాడని చెప్పారు. ఉదయానికల్లా పరిస్థితి బాగా విషమించటంతో గ్రామంలోని వైఎస్సార్ సీపీ నేతలు అక్కడకు వెళ్లి చూస్తే పరిస్థితులు చాలా ఘోరంగా ఉన్నాయని వివరించారు. కలెక్టర్ స్పందించి అక్కడ ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేకపోవటంతో కళ్యాణ మండపంలో విద్యార్థులకు వైద్య సేవలు అందించే ఏర్పాటు చేశారని చెప్పారు. ఆరోగ్య పరిస్థితి బాగా ఇబ్బందిగా ఉన్న 14 మందిని గుంటూరు జీజీహెచ్ చేర్పించినట్లు వివరించారు. వీరిలో ఇద్దరిని ఐసీయూ ఉంచినట్లు వెల్లడించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు సరైన పరీక్షలు చేయలేదని, సరైన చికిత్స కూడా అందించలేదని ఆరోపించారు.

కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పట్నంబజారు: బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దంటూ.. చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలు, కళాశాలలు అంటే పేదలకు దేవాలయాలతో సమానమని, వాటిని అమ్ముకునేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంగల వలివీరారెడ్డి మాట్లాడుతూ రాజధాని భూముల్లో వ్యాపారం చేసిన కూటమి నేతలు, మెడికల్ కళాశాలలను వ్యాపారం చేద్దామని చూస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కొత్తా చిన్నపరెడ్డి, పఠాన్‌సైదాఖాన్ ఓర్సు శ్రీనివాసరావు, సురసాని వెంకటరెడ్డి, యువజన విభాగం నగర అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావుయాదవ్, వేలూరి అనిల్‌రెడ్డి, శశి, కార్పొరేటర్‌లు బూసి రాజలత, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దోచుకోవటమే లక్ష్యంగా కూటమి పాలన

పట్నంబజారు: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోచుకోవడమే లక్ష్యంగా పరిపాలన చేస్తోందని, అందుకు నిలువెత్తు నిదర్శనం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సూరసాని వెంకటరెడ్డి ఆరోపించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ విధానంలో కేవలం తన అనుమయులకు దోచిపెట్టేందుకు ప్రైవేటీకరణ కుట్రకు కూటమి తెరదీసిందని మండిపడ్డారు.

పేదల ఆకాంక్షలను నెరవేర్చాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి నాంది పలికారన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేసి.. వేలాది కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్ తరాలకు మేలు జరిగితే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న నీచ బుద్ధితో మెడికల్ కళాశాలను నాశనం చేసేందుకు కూటమి నేతలు సిగ్గుఎగ్గు లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. కచ్చితంగా పేద ప్రజల పక్షాన ఎంతటి పోరాటాలకు వెనుకాడబోమని, వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం దిగ్విజయం పూర్తి అవుతుందని చెప్పారు.

అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

వెస్ట్ ఈఆర్ఓ చల్లా ఓబులేసు



కరపత్రం ఆవిష్కరిస్తున్న అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

నెహ్రూ నగర్: త్వరలో స్థానిక ఎన్నికలు రానున్న సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అమలుకు చర్యలు తీసుకుంటామని పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 12 వందల మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు తీసుకున్నామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాలు మార్పులు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

అనంతరం కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన జీఎస్టీ 2.0పై రాజకీయ పార్టీలు కూడా ప్రజలకు అవగాహన కల్గించాలని కోరుతూ ఆయా పార్టీల ప్రతినిధులతో కలిసి జీఎస్టీ తగ్గింపుపై రూపొందించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. సమావేశంలో జీఎంసీ డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎన్.ఓంకార్ (తెలుగుదేశం), హెచ్. రామకృష్ణ(బీజేపీ), డి.జాన్ బాబు(వైఎస్సార్ సీపీ), సిహెచ్.వాసు (బీఎస్పీ), బిల్లా సునీల్ కుమార్(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), తాతా సేవా కుమార్ (అమ్ ఆద్మీ పార్టీ), షేక్ కాశీం (సీపీఎం) పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: విద్యుత్ శాఖ డీ-13 సెక్షన్ ఆర్టీసీ కాలనీ పరిధిలోని 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల్లో భాగంగా శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ శాఖ గుంటూరు-4 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కొరిటెపాడు: సుద్దపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ లైనుల మరమ్మతుల్లో భాగంగా శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుంటూరు -4 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రమేష్, అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ప్రగతి నగర్, యానాది కాలనీ విజయశాంతి నగర్, లక్ష్మీ నగర్, బాలాజీ నగర్, యాదవుల బజార్, అలీ నగర్, గొలుసు కొండలరావు నగర్, బూరెలు వారి వీధి, యాదవుల బజార్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెహ్రూ నగర్ ఉపకేంద్రం పరిధిలోని రైల్వే క్వార్టర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రైల్వే క్వార్టర్స్, నెహ్రూనగర్ తదితర సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

33 కేవీ ఫీడర్‌లో సబ్ స్టేషన్ మెయింటనెన్స్‌లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. బ్రాడీపేట, లక్ష్మీపురం, చంద్రమౌళి నగర్, అశోక్ నగర్, దేవపురం, కృష్ణ నగర్, కొబాల్ట్ పేట, పట్టాభిపురం, జార్జ్ పేట, రామన్నపేట తదితర ప్రాంతాల్లో సరఫరాలో ఉండదని చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు

జేసీ అశుతోష్ శ్రీవాస్తవ



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జేసీ

గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో అన్ని వర్గాల ప్రజలకు మేలు అని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. స్థానిక ఏసీ కాలేజ్ గ్రౌండ్‌తో పాటు అసెంబ్లీ హాలులో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆయనతో పాటు జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, జీఎస్టీ జాయింట్ కమిషనర్ గీతా మాధురి హాజరయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జీఎస్టీ ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు జీఎస్టీ 2.0లో ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు, తక్కువ పన్నుల విధానాలు, వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వలన రోజురోజుకు మానసిక సమస్యలు పెరిగిపోవడం చాలా ఆందోళన కలిగిస్తోందని గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్ అన్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా మానసిక సమస్యలు పెరిగిపోతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే మానసిక వ్యాధులను గుర్తించడం ద్వారా త్వరితగతిన నివారించవచ్చన్నారు. వ్యాధి బాధితులకు చికిత్స, కౌన్సెలింగ్‌తో పాటు కుటుంబ సభ్యుల ఆదరణ తప్పనిసరిగా ఉండాలన్నారు.

డ్రగ్స్ విక్రయాలు నియంత్రించాలని వినతి



జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న బీజేపీ నాయకులు

నగరంపాలెం: స్థానిక నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ)ంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందించారు. జిల్లాలో యువత డ్రగ్స్ వాడకం ఎక్కువగా ఉందని జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. డ్రగ్స్ విక్రయాలను నియంత్రించాలని అన్నారు. సైబర్ నేరాల వల్ల అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, చరక కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, బి.రామకృష్ణ, డి.సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.వీరమణింద్ర ఉన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

ప్రత్తిపాడు: విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. పెదనందిపాడు మండలం అన్నపర్రు బీసీ బాలుర హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరంతో అస్వస్థతకు గురై పెదనందిపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం సాయంత్రం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్‌తో కలసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇంత మంది పిల్లలు ఆహారం కలుషితమై అస్వస్థతకు గురికావడం చిన్న విషయం కాదన్నారు. దేవుడి దయ వలన పిల్లలకు ఏమీ కాలేదని, ఎంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. దీనికి కారణం అధికారుల పర్యవేక్షణాలోపమా, లేక హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమా.. అన్నది వారే ఆలోచించుకోవాలని చెప్పారు. హాస్టళ్లలోని కుక్‌లు ఏదో తూతూమంత్రంగా శుభ్రం చేసి ఆహారం వండివార్చుతున్నారని, చిత్తశుద్ధి లేకనే ఇలా ఆహారం కలుషితం అవుతుందని ఆరోపించారు. ఇలాంటి ఘటనల వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందన్నారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీ శాఖలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందన్నారు. వారికి మంచి ఆహారం అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. నిర్లక్ష్య ధోరణి కూడా చాలా ఎక్కువగా కనిపిస్తుందని, ఉద్యోగుల్లో ఏముందిలే అనే వైఖరి వారిలో స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. నిర్లక్ష్యమే ఆహారం కలుషితానికి కారణమన్నారు. వెంట బీసీ నాయకులు హనుమంత్‌యాదవ్, దారం అశోక్ కుమార్ ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పరామర్శ

లక్ష్మీపురం: పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామ బీసీ హాస్టల్లో అస్వస్థకు గురై నగరంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.పవన్ కుమార్, షేక్‌సమీర్ ఉన్నారు.

సీఎంను చంపుతానని బెదిరించిన వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

నగరంపాలెం(గుంటూరు): ముఖ్యమంత్రిని చంపుతానంటూ ఫోన్ కాల్‌లో బెదిరించిన వ్యక్తిని పోలీసులు విచారిస్తు న్నారు. వివరాలు.. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన వెంకటనాగేశ్వరరావు రెండు రోజుల క్రితం డయల్ 100కి ఫోన్ చేసి గంటలో సీఎంను చంపుతానంటూ బెదిరించడం కలకలం రేపింది. పోలీసులు అప్పటికప్పుడు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు బెదిరించిన ఫోన్ నంబర్‌ను గుంటూరు జిల్లా కంట్రోల్ రూంకు తెలియజేశారు. సెల్‌టవర్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి వెంకటనాగేశ్వరరావు అని, మంగళగిరిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం అతన్ని మంగళగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అతన్ని మరోసారి అతన్ని విచారించారు. మద్యం మత్తులో ఉండగా తిట్టినట్లు పోలీసుల ఎదుట చెప్పినట్లు తెలిసింది. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన అతను పనులకు వెళ్లకుండా ఉండటం, మద్యం మత్తులో ఊగిసలాడేవాడని గుర్తించారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారని పోలీసుల విచారణలో గుర్తించారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు మానసికంగా ఎంత ఆరోగ్యంగా ఉంటే సమాజానికి అంతగా ఉపయోగపడతారని, ఉత్తమ పౌరులుగా రూపొందుతారని కాటూరి మెడికల్ కళాశాల విశ్రాంత మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్ కుమార్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో నిర్వహించ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్. జోత్స్న కుమారి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, దృఢంగా తయారవ్వాలని, సేవా తత్పరతను అలవరచుకోవాలని సందేశమిచ్చారు. కార్యక్రమంలో మానవత సంస్థ డైరెక్టర్లు సిహెచ్.లక్ష్మీ సామ్రాజ్యం, ఎస్ సాంబశివరావు, ఎన్రోల్మెంట్ కమిటీ చైర్మన్ సిహెచ్.శివాజీ, మెడికల్ క్యాంపు ఇన్‌చార్జి ధనుంజయ రెడ్డి, మెంబర్లు పావని, పింగళి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ధాత్రి కుమారి, కె.రత్నమ్మ, కె.విజయ కుమారి పాల్గొన్నారు.

సర్వైలెన్స్ యూనిట్ వేగంగా ఏర్పాటు చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఎం.ఎస్.యూ. బృందంతో చర్చిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా గుంటూరు నగరానికి మంజూరైన ప్రతిష్టాత్మక మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎం.ఎస్.యూ.) ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక మెడికల్ కాలేజీలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఏర్పాటు పనులను పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎం.ఎస్.యూ. బృందం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో కమిషనర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలు, నాణ్యతతో కూడిన వైద్య పరీక్షలు చేయడానికి వీలుగా గుంటూరు నగరంలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్‌ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. సమావేశంలో ఎం.ఎస్.యూ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ ప్రణయ్ వర్మ, వై.శ్రీను, డాక్టర్ సత్యమ్ సిల్, జీఎంసి ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారయణ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

నెహ్రూనగర్: నగరంలో డ్రెయిన్‌లపై ఆక్రమణలను, ర్యాంప్‌లను తొలగించిన ప్రాంతాల్లో సమగ్రంగా పూడిక తీత చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను కోరారు. బృందావన్ గార్డెన్స్, రాజేంద్ర నగర్, చాకలి గుంట, శశాంక్ గోయల్ కాలనీ, బాలాజీ నగర్ టీచర్స్ కాలనీల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్లలోకి వర్షం నీరు వెళ్లడానికి వీలులేకుండా నిర్మాణం చేసిన ఆక్రమణలను, ర్యాంపులను దశలవారీగా తొలగిస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులు పూడికతీత పనులు చేపట్టి, అవసరమైతే నూతన డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తొలగించిన పూడిక వ్యర్థాలను వెంటనే తరలించాలని సూచించారు. శశాంక్ గోయల్ కాలనీలో నగరపాలక సంస్థ నుంచి నుంచి తీసుకున్న నిర్దేశిత ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణం చేస్తున్న భవనాన్ని పరిశీలించి తక్షణం తొలగించాలని ఆదేశించారు. బాలాజీ నగర్ టీచర్స్ కాలనీలో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో రోడ్ ఆక్రమణలు తొలగించకపోవడంపై పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించి, ప్రతి సచివాలయం పరిధిలో ముఖ్యంగా డ్రెయిన్‌లు, ప్రధాన రోడ్ల ఆక్రమణల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ కళ్యాణరావు, ఎస్.ఎస్.ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన



గుంటూరు రూరల్: వ్యవసాయంలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని జొన్నలగడ్డలో శుక్రవారం చేపట్టారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.మనోజ్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో భాగంగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతుల కోసం వివిధ జీవన ఎరువులను అభివృద్ధి చేసిందని తెలిపారు. వీటిలో ముఖ్యమైనవి రైజోబియం, ఫాస్ఫరస్ సొల్యూబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా, అజోస్పైరిల్లం, వేమ్ తదితర జీవన ఎరువులు ఉన్నాయని చెప్పారు. వీటిని రైతులు వినియోగించడం ద్వారా రసాయనిక ఎరువుల మోతాదుని 20-25 శాతం తగ్గించడమే కాకుండా భూసారం పెంచుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులకు జీవన ఎరువులతో విత్తనశుద్ధి పద్ధతిని క్షేత్రస్థాయిలో ప్రదర్శించి చూపారు. ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర నలుమూలల వివిధ గ్రామాలలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.